JAYABHERIDAILY.COM

ప్రభాత

# జయభేరి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి | గురువారం 23-07-2026

Medchal - Malkajgiri | Thursday 23-07-2026

Follow: jayabherinews

సంపుటి : 03 | సంచిక : 52

పేజీలు : 8 | వెల : 5

Vol. 03 | Issue 52 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com



## గత పదేళ్లలో 152 పేపర్ లీక్‌లు..

# ఒక్కదానికి శిక్ష పడలేదు



- పేపర్ లీక్ అంశం పై మూడు రోజులుగా స్తంభించిన పార్లమెంట్
- ఢిల్లీలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన రాహుల్ గాంధీ
- మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పునరుద్ఘాటన
- కేంద్రంపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు

**జయభేరి, న్యూఢిల్లీ:**

నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్‌పై ప్రధాన ప్రతిపక్ష నేత కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మీడియాకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. గత పదేళ్లలో 152 పేపర్లు లీకయ్యాయి కానీ, ఒక్కదానికి శిక్షపడలేదని ఆయన ఆరోపించారు. 'దేశానికి అత్యంత విలువైన ఆస్తి అయిన మన విద్యా వ్యవస్థను ఓ వ్యక్తి లేదా సమూహం నాశనం చేసి, మన విద్యార్థుల జీవితాలను ధ్వంసం చేసింది... మరి ప్రభుత్వం ఏం చేస్తుంది? ఒక్కరికి కూడా శిక్షలు విధించలేదు. ...మిగతాది 2 లో



## అది.. బ్రిటీషోళ్ల జనతా పార్టీ

# అందుకే పీఎంగా..

- విద్యార్థులు, నిరసనకారులపై పోలీసులు అమానుషంగా లాఠీచార్జ్
- అరెస్ట్ చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్
- పేదలు, యువత హక్కుల కోసం గత వందేళ్లుగా కాంగ్రెస్ రాజీలేని పోరాటాలు సాగిస్తోంది
- పాకిస్తాన్ కు వద్దన్నా నీటిని విడుదల చేస్తోన్న కేంద్రం- ఫ్లాష్ ఫ్లడ్స్ దెబ్బకు
- రానున్న రోజుల్లో మోదీని గద్దె దించి, రాహుల్ గాంధీని ప్రధానమంత్రి పీఠంపై కూర్చోబెట్టడమే తమ ఏకైక లక్ష్యం

**జయభేరి, హైదరాబాద్ :**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ ఉదంతం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ క్రమంలో విద్యార్థులకు మద్దతుగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టులకు నిరసనగా వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ఈ ఉదయం జరిగిన భారీ ఆందోళన కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిపై రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. నీట్ పరీక్ష రాసిన లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును మోదీ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టేసిందని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వైఫల్యం వల్లే ఈ అక్రమాలు జరిగాయని, ఆయనను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్న ప్రధాని మోదీ ఆయనను తొలగించకపోతే స్వయంగా తానే రాజీనామా చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యయుతంగా తమ గొంతుకను వినిపిస్తున్న విద్యార్థులు, నిరసనకారులపై పోలీసులు అమానుషంగా లాఠీఛార్జ్ చేయడాన్ని రేవంత్ రెడ్డి తప్పుపట్టారు. వైబ్రెంట్ డెమోక్రసీగా చెప్పుకునే భారత్ లో ఇలాంటి బలప్రయోగాలు చేయడం ఆందోళనకరమని, భిన్నాభిప్రాయాలు వ్యక్తపరిచే స్వేచ్ఛను రాజ్యాంగం ప్రతి పౌరుడికీ కల్పించిందని, ఆ హక్కును గౌరవించాల్సిన ...మిగతాది 2 లో

## నెక్లెస్ రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు

# కాంగ్రెస్ నేతల భారీ ర్యాలీ

- రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా హైదరాబాద్ కాంగ్రెస్ ర్యాలీ
- లోక్‌భవన్ వద్ద మంత్రులు, పీసీసీ అధ్యక్షుడి అరెస్ట్
- హన్మకొండ నిరసనలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**జయభేరి, హైదరాబాద్ :**

దేశ రాజధాని ఢిల్లీ వేదికగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర విపక్ష నేతల ముందస్తు అరెస్టులను నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు రణరంగం సృష్టించాయి. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఉదయం వేలాది మంది కాంగ్రెస్ ...మిగతాది 2 లో






# నీట్ అంశంపై చర్చకు సిద్ధం

- జేపీ నడ్డా

**జయభేరి, న్యూఢిల్లీ:**

నీట్ ప్రశ్నాపత్రం అంశంపై రోజురోజుకూ వివాదం ముదురుతోంది. కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఆధ్వర్యంలో దేశ రాజధాని దిల్లీలో ఇటీవల నిర్వహించిన ఛలో సంసద్ ర్యాలీలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. పార్లమెంట్ ముట్టడికి దూసుకొచ్చిన విద్యార్థులపై పోలీసులు లాఠీ ఛార్జ్, బాష్ప వాయువును ప్రయోగించారు. దాంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అటు దేశంలోని ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నాయి. విద్యార్థులపై లాఠీ ఛార్జ్ ను తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా కేంద్ర మంత్రి జేపీ నడ్డా కీలక ప్రకటన చేశారు. నీట్ అంశంపై పార్లమెంట్ లో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. పేపర్ లీక్ వ్యవహారంపై సమగ్రంగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

# ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ

- పార్లమెంట్ హౌస్‌లో మోదీని కలిసిన చంద్రబాబు
- భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ఆహ్వానం




**జయభేరి, న్యూఢిల్లీ:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు.. పార్లమెంట్ హౌస్‌లో ప్రధానితో భేటీ అయ్యారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. అనంతరం రాష్ట్రానికి చెందిన పలు అంశాలపై ప్రధానితో చంద్రబాబు చర్చించారు. ఇక భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించనుంది. ఈ క్రమంలోనే పలువురు ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఆగస్ట్ ఒకటో తేదీన ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంజరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవానికి ప్రధానిని ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళ్లారు సీఎం చంద్రబాబు. బుధవారం మధ్యాహ్నం సమయంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడుతో పాటుగా పార్లమెంట్ హౌస్‌లో ప్రధానిని కలిశారు చంద్రబాబు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా అహ్వానించారు.

# విభజన చట్టం ప్రకారం సీట్లు పెంచాల్సిందే!

# రూ.250 కోట్లు కేటాయించలేరా?

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ కి కేటీఆర్ లేఖ




**జయభేరి, ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ జిల్లాలోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పునరుద్ధరణ అనేది కేవలం ఒక పరిశ్రమకు సంబంధించిన అంశం మాత్రమే కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అలాంటి అంశంపై కాంగ్రెస్ వైఖరి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు.



# రెడ్కో డీఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

- భారీగా నగదు, ఆస్తి పత్రాలు స్వాధీనం
- 15 చోట్ల 8 బృందాలు చేసిన సోదాల్లో భారీగా నగదు లభ్యం
- సాయంత్రానికి పూర్తి వివరాలు వెల్లడించనున్న అధికారులు

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ పునరుత్పాదక ఇంధనాభివృద్ధి సంస్థ (రెడ్కో)లో కీలక పదవిలో ఉన్న ఉన్నతాధికారి అక్రమార్జన లీలలపై అవినీతి నిరోధక శాఖ ఉక్కుపాదం మోపింది. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే పక్కా ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## అది.. బ్రిటీషోళ్ల జనతా పార్టీ అందుకే పీఎంగా..

బాధ్యత పాలకులపై ఉందని అన్నారు. అరెస్ట్ చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీని బ్రిటీష్ జనతా పార్టీ అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. స్వాతంత్ర్య సమరంలో బ్రిటీష్ వారితో పోరాడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని, పేదలు, యువత హక్కుల కోసం గత వందేళ్లుగా కాంగ్రెస్ రాజీలేని పోరాటాలు సాగిస్తోందని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పోరాటం కాంగ్రెస్, బీజేపీ మధ్య ఎన్నికల పోరు మాత్రమే కాదని.. దేశాన్ని రక్షించుకునేందుకు గాంధీ, గాడ్సే వారసులకు మధ్య జరుగుతున్న ఒక చారిత్రక యుద్ధమని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ జోడీ కలిసి ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రజలను దోచుకోవడానికి ప్రయత్నిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. వారి కుట్రలను కాంగ్రెస్ పార్టీ ఎట్టిపరిస్థితుల్లోనూ సాగనివ్వబోదని తేల్చి చెప్పారాయన. భవిష్యత్తులో దేశ యువత అంతా ఏకమై మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికి సిద్ధంగా ఉందని, రానున్న రోజుల్లో మోదీని గద్దె దించి, రాహుల్ గాంధీని ప్రధానమంత్రి పీఠంపై కూర్చోబెట్టడమే తమ ఏకైక లక్ష్యమని ప్రకటించారు.

**పాకిస్తాన్ కు వద్దన్నా నీటిని విడుదల చేస్తోన్న కేంద్రం**

తమ నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల దిశానిర్దేశంలో వీధుల నుంచి ఢిల్లీ పార్లమెంtop వరకు ఈ సుదీర్ఘ పోరాటాన్ని ఉధృతం చేస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అన్యాయం జరిగిన ప్రతిసారీ కాంగ్రెస్ ప్రజల పక్షాన నిలబడుతుందని, ప్రజాస్వామ్య హక్కుల రక్షణ కోసం నిరంతరం గొంతు వినిపిస్తుందని వ్యాఖ్యానించారు.

## ఒక్కదానికి శిక్ష పడలేదు

కాబట్టి మన యువత నిరసన తెలపడానికి ఇదే మొదటి కారణం.. ఇది పూర్తిగా సమంజసమైంది'' అని అన్నారు. విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని, ఆయన ఆ పదవిలో కొనసాగడానికి అనర్హుడని ధ్వజమెత్తారు. ''అందరికీ చాలా స్పష్టంగా కనిపిస్తున్న విషయం ఏంటంటే.. ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమైనదిగా గుర్తింపు పొందిన మన విద్యా వ్యవస్థ నేడు కుమ్మక్కు, అక్రమాలతో నిండిపోయింది... గత పదేళ్లలో 152 పేపర్ లీకేజీలు జరిగాయి.

అంటే దాదాపు నెలకు ఒకటి.. ప్రతి నెలా లక్షలాది మంది విద్యార్థులకు 'మీరు పడిన మానసిక ఒత్తిడినంతటినీ మళ్లీ అనుభవించాల్సిందే' అని చెప్తున్నారు. ఆ తర్వాత 'మాకు అస్సలు పట్టదు' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు... 7.5 కోట్ల మంది విద్యార్థులు, వారి కుటుంబాలు దీనివల్ల నష్టపోతున్నారు.. వీరంతా మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందినవారు... వారు తమ కష్టార్జితాన్ని దీనిపై పెడితే దానికి కనీస గౌరవం కూడా దక్కడం లేదు. దీంట్లో విచిత్రమేమిటంటే ఒక్కరికి కూడా శిక్ష పడకపోవడం. గత 10 ఏళ్లలో 152 లీకేజీలు జరిగినా, ఒక్క శిక్ష కూడా పడలేదు. అంటే ఎవరో ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం మన విద్యా వ్యవస్థను, భారతదేశ అత్యంత విలువైన ఆస్తిని నాశనం చేస్తూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు.. మరి ప్రభుత్వం ఏం చేస్తోంది?'' అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.

''మన విద్యార్థులకు ఇలా ఎందుకు జరుగుతోంది అన్నదే అసలు ప్రశ్న. వాళ్లు ఏం తప్పు చేశారు? భద్రతా దళాలు వారిపై ఆయుధాలు గురిపెడుతున్నాయి.. శాంతియుతంగా నిరసన తెలుపుతూ, తమ డిమాండ్లను అడుగుతున్నారు.. ఈ దేశం తమకు ఇవ్వాల్సిన వాటిని కోరుతున్నారు. దేశ విద్యార్థులుగా మాకు న్యాయమైన విద్యా వ్యవస్థ కావాలని మాత్రమే వారు అడుగుతున్నారు... ఎంతో మంది పిల్లలు ఆత్మహత్యలు చేసుకున్నారు. మన విద్యార్థులు అంతులేని ఒత్తిడికి గురవుతుంటే, చివరి నిమిషంలో పేపర్ లీక్ అయిందని వారికి చెబుతారు...'' అని రాహుల్ గాంధీ మండిపడ్డారు.

విద్యా వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. విద్యకు కేంద్ర బడ్జెట్ రూ.1.42 లక్షలు కోట్లు అయితే.. తల్లిదండ్రులు రూ.1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని, దేశ విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందని అన్నారు. విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారని, దాడిచేసినవారిపై చర్యలు తీసుకోవాలని, ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు.

## నీట్ అంశంపై చర్చకు సిద్ధం

ఈ మేరకు దేశంలోని విద్యార్థుల భవిష్యత్తుపై తమకు పూర్తి బాధ్యత ఉందని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారాన్ని ఎన్డీఏ ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని మండిపడ్డారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ మేరకు బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "రాహుల్ గాంధీకి విద్యార్థుల సంక్షేమంపై ఆసక్తి లేదు. ఆయన కేవలం నీట్ అంశంతో విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయంగా ప్రయోజనం పొందాలని చూస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పేపర్లు లీక్ అయ్యాయి. నీట్ అంశంపై పార్లమెంట్ లో చర్చకు సిద్ధంగా ఉన్నాం. హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇంటర్ పేపర్, కేరళ, తమిళనాడు, బెంగాల్, కర్ణాటక పేపర్లు లీక్ జాబితా చాలానే ఉంది" అని కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.

ఢిల్లీలో మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల కాన్క్లేవ్ లో ప్రధాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర శిక్ష, పీఎం శ్రీ, నిపుణ్ భారత్, పీఎం పోషణ్, ఉల్లాస్ కార్యక్రమాల ద్వారా దేశంలో విద్యా వ్యవస్థ బలోపేతం అయిందని తెలిపారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. అయితే ప్రస్తుతం నీట్ అంశం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న తరుణంలో ఆయన ఈ అంశంపై మాట్లాడకపోవడం గమనార్హం. సీజేపీ ఆందోళనకారులు, యువతపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని కేంద్ర ప్రభుత్వం హామీ ఇస్తేనే తాను దీక్ష విరమించేందుకు సిద్ధమని ప్రకటించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న ఆయన అక్కడే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

## ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ

రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం కోసంఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లుచేపడుతోంది. ఇందులో భాగంగా పలువురు ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఏపీ మున్సిపల్ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. నలుగురు ఐఏఎస్ అధికారులు ప్రజా అవసరాలు, పారిశుద్ధ్య వ్యవహారాలను పర్యవేక్షిస్తారు.

రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, గుంటూరు మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్‌లకు ఈ బాధ్యతలను అప్పగించారు. వీరికి సహాయ, సహకారం అందించేందుకు 26 మంది నాన్ క్యాడర్ అధికారులను కేటాయించారు. వీరంతా విజయనగరం జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేయనున్నారు.

విజయనగరం జిల్లాలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే.. ఈ ప్రాంతానికి మణిహారంగా మారుతుందని నిపుణులు చెప్తున్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు వచ్చిన తర్వాత.. ఆ పరిసరాల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయో అదే తరహాలో భోగాపురం కూడా అభివృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని.. కొత్త ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు.

# విభజన చట్టం ప్రకారం సీట్లు పెంచాల్సిందే!




కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించే డీలిమిటేషన్ చట్టం అమల్లోకి వస్తే కేవలం లోక్‌సభ స్థానాలే పెరుగుతాయా లేక రాష్ట్రాల శాసనసభ సీట్లు కూడా పెరుగుతాయా? అనేది ఇప్పుడు తెలుగు రాష్ట్రాల పొలిటికల్ సర్కిళ్లలో అత్యంత ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. డీలిమిటేషన్ అనేది నియోజకవర్గాల పునర్విభజన. జనాభా మార్పులకు అనుగుణంగా అసెంబ్లీ, లోక్‌సభ సీట్ల సంఖ్య, సరిహద్దులను మార్చడం. దీని ద్వారా అన్ని నియోజకవర్గాల్లో జనాభా దాదాపు సమానంగా ఉంటారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ సీట్లు కూడా జనాభా నిష్పత్తి ప్రకారం సర్దుబాటు చేస్తారు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలన్నీ.. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఉన్నాయి. కానీ తెలుగు రాష్ట్రాల్లో విభజన సమయంలోనే సీట్ల పెంపు హామీ ఇచ్చారు. డీలిమిటేషన్ అనగానే చాలామంది కేవలం ఎంపీ సీట్ల పెంపు గురించే చర్చిస్తున్నప్పటికీ, రాజ్యాంగ నిబంధనలు , ప్రతిపాదిత 131వ రాజ్యాంగ సవరణల ప్రక్రియ ప్రకారం పార్లమెంట్ సీట్లతో పాటు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలు కూడా ఖచ్చితంగా పెరుగుతాయి. రాజ్యాంగంలో లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ప్రత్యేకమైన అధికరణలు ఉండటమే దీనికి ప్రధాన కారణం.భారత రాజ్యాంగం ప్రకారం లోక్‌సభ స్థానాల విభజన ఆర్టికల్ 81, 82ల ప్రకారం జరిగితే.. రాష్ట్ర శాసనసభ స్థానాల పునర్విభజన ఆర్టికల్ 170 పరిధిలోకి వస్తుంది. డీలిమిటేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు, రాజ్యాంగంలోని ఈ రెండింటికీ వేర్వేరుగా లేదా ఒకే రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా సవరణలు చేయాల్సి ఉంటుంది. ఆర్టికల్ 170 పై ఉన్న నిషేధాన్ని తొలగించకుండా కేవలం ఎంపీ సీట్లను పెంచడం సాధ్యపడదు. కాబట్టి డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమైతే లోక్‌సభతో పాటు ప్రతీ రాష్ట్ర శాసనసభ స్థానాల సంఖ్యను కూడా దామాషా పద్ధతిలో పెంచడానికి చట్టపరమైన ప్రాతిపదిక సిద్ధమవుతుంది.ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు సంబంధించి ఒక ప్రత్యేకమైన చట్టపరమైన కోణం కూడా ఉంది. 2014లో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం..విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ సీట్లను 225కి, తెలంగాణలో ఉన్న 119 సీట్లను 153కి పెంచాలని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం 2026 తర్వాత జరిగే తొలి జనాభా లెక్కల వరకూ సీట్ల పెంపుపై ఫ్రీజ్ ఉన్నందున, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని ఆ నిబంధన అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లు ద్వారా ఆర్టికల్ 170 సవరణ జరిగి నియోజకవర్గాల సరిహద్దుల ఫ్రీజ్ తొలగిపోతే.. తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపుకు ఉన్న ఏకైక రాజ్యాంగ అడ్డంకి పూర్తిగా తొలగిపోతుంది.మరి ఏపీ, తెలంగాణల్లో సీట్లు పెరుగుతాయనడానికి ఖచ్చితమైన గ్యారంటీ ఉందా అంటే.. సమాధానం నూటికి నూరు శాతం గ్యారంటీ అనే చెప్పాలి. ఎందుకంటే, కేంద్రం ప్రతిపాదిస్తున్న సార్వత్రిక డీలిమిటేషన్ నమూనా 50 శాతం స్థానాల పెంపు ప్రాతిపదిక ప్రకారం లేదా ఏపీ విభజన చట్టం సెక్షన్ 26 ప్రకారం చూసినా సీట్ల సంఖ్య పెరగడం ఖాయం. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. డీలిమిటేషన్ అమల్లోకి వస్తే ఏపీలో ప్రస్తుతం ఉన్న 25 లోక్‌సభ స్థానాలు 38కి, తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలు 26కి పెరుగుతాయి. లోక్‌సభ స్థానాలు పెరిగినప్పుడు, దానికి అనుగుణంగా ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ స్థానాల విస్తరణ జరగడం తప్పనిసరి. ప్రస్తుతం ఒక పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయ్యాక ఏపీ అసెంబ్లీ స్థానాల సంఖ్య 175 నుంచి కనీసం 225 లేదా అంతకంటే ఎక్కువకి , తెలంగాణ అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 153 లేదా 160కి పైగా పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కావడం, అది ప్రకటన విడుదల చేయడం ద్వారా మాత్రమే కొత్త నియోజకవర్గాల సరిహద్దులు, ఎస్సీ/ఎస్టీ రిజర్వుడు స్థానాల వర్గీకరణ ఖరారవుతాయి. దీనికోసం ప్రత్యేకంగా రాష్ట్ర అసెంబ్లీలు మళ్లీ తీర్మానాలు చేయాల్సిన అవసరం లేదు. కేంద్ర పార్లమెంట్ ఆమోదించే డీలిమిటేషన్ చట్టమే రాష్ట్ర స్థానాల పెంపునకు నేరుగా వర్తిస్తుంది. ఈ సీట్ల పెంపు ప్రక్రియ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తీవ్రమైన రాజకీయ సంచలనాలకు, సమీకరణలకు దారితీయనుంది. ప్రతి నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నాయకులకు, యువ నాయకులకు కొత్తగా ఎమ్మెల్యేగా పోటీ చేసే సువర్ణావకాశం లభిస్తుంది. అంతేకాకుండా, గ్రేటర్ హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాల్లోనూ, అమరావతి పరిసర ప్రాంతాల్లోనూ జనాభా ప్రాతిపదికన మరిన్ని కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఏపీలో 175, తెలంగాణలో 119 అసెంబ్లీ సీట్లతోనే ఎన్నికలు జరుగుతాయి. 2028 చివర్లో తెలంగాణ, 2029లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు పాత నియోజకవర్గాల ప్రాతిపదికనే జరగవచ్చు. ఇది ప్రజలకు కొత్త సమస్యలు తెస్తుంది. జనాభా పెరిగిన ప్రాంతాల్లో ఒక ఎమ్మెల్యేకి ఎక్కువ ఓటర్లు, అసమాన ప్రాతినిధ్యం ఉంటుంది. ఉదాహరణకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణ ప్రాంతాల్లో జనాభా ఎక్కువ కాబట్టి వారి సమస్యలు సరిగా ప్రతిబింబించకపోవచ్చు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గినట్టు అనిపించవచ్చు. డీలిమిటేషన్ పార్లమెంట్‌కే పరిమితం కాదు, అది రాష్ట్రాల శాసనసభలను కూడా సమాంతరంగా పునర్వ్యవస్థీకరిస్తుంది. రాజ్యాంగ సవరణ బిల్లులు చట్ట రూపం దాల్చిన మరుక్షణమే డీలిమిటేషన్ కమిషన్ రంగంలోకి దిగుతుంది. అందువల్ల ఏపీ , తెలంగాణ అసెంబ్లీలలో స్థానాలు పెరగడం అనేది కేవలం ఒక రాజకీయ అంచనా మాత్రమే కాదు, రాజ్యాంగపరంగా, చట్టపరంగా జరగబోయే ఒక అనివార్యమైన పరిణామం!

## రూ.250 కోట్లు కేటాయించలేరా?

■ **కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ**



జయభేరి, ఆదిలాబాద్ :

ఆదిలాబాద్ జిల్లాలోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పునరుద్ధరణ అనేది కేవలం ఒక పరిశ్రమకు సంబంధించిన అంశం మాత్రమే కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అలాంటి అంశంపై కాంగ్రెస్ వైఖరి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. వేలాది కుటుంబాల జీవనాధారమైన పరిశ్రమ విషయంలో ప్రభుత్వ క్లారిటీతో ఉంటే కేంద్రం మాట వింటుందని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా పారిశ్రామిక భవిష్యత్తు, తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన అత్యంత కీలకమైన అంశంలో ఆలోచన విధానం తెలపాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. "అందుకే, ఆదిలాబాద్‌లో సిమెంట్ పరిశ్రమను పునఃప్రారంభించాలనే లక్ష్యంతో, ఈ నెల 15వ తేదీన సీసీఐ సాధన సమితి ప్రతినిధులతో కలిసి బీఆర్ఎస్ నేతల బృందం ఢిల్లీ వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డీ. కుమారస్వామిని కలిశారం. ఈ సందర్భంగా ఆదిలాబాద్‌లోని సీసీఐ పరిశ్రమను తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశాం. ఆదిలాబాద్ సీసీఐ పునరుద్ధరణ వల్ల ఉపాధి అవకాశాలు, స్థానికంగా కలిగే ప్రయోజనాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో జరిగే ప్రగతి గురించి కేంద్రమంత్రికి వివరించాం." అని రాసుకొచ్చారు.

## కాంగ్రెస్ నేతల భారీ ర్యాలీ

నాయకులు, శ్రేణులు లోక్‌భవన్ వైపు తరలి వెళ్లారు. అప్పుడే పోలీసులు అక్కడకు చేరుకుని.. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు రాష్ట్ర కేబినెట్ మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ కీలక నేత అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, పలువురు ముఖ్య నాయకులను అరెస్ట్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా.. దేశరాజధాని ఢిల్లీలో రాహుల్ గాంధీ సహా ప్రధాన ప్రతిపక్ష నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఏఐసీసీ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యక్ష నేతృత్వంలో రాజధాని హైదరాబాద్‌లో 'ఛలో లోక్‌భవన్' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు.

**నెక్లెస్ రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ**

ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని ప్రముఖ నెక్లెస్ రోడ్ ప్రాంతం నుంచి లోక్‌భవన్ వైపు వేలాది మంది కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరారు. ఈ ప్రదర్శనలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు రాష్ట్ర కేబినెట్ మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ కీలక నేత అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీని ముందుకు తీసుకెళ్లారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న క్రమంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. లోక్‌భవన్ ముట్టడికి యత్నించిన నాయకులను అడ్డుకున్న పోలీసులు.. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో పాటు అక్కడ ఉన్న ముఖ్య నాయకులను బలవంతంగా అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

**హన్మకొండలో డిప్యూటీ సీఎం భట్టి ఆధ్వర్యంలో నిరసనలు**

మరోవైపు హన్మమకొండ జిల్లా కేంద్రంలో సైతం ఏఐసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. ఈ నిరసన ప్రదర్శనలో రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖలతో పాటు పలువురు స్థానిక శాసన సభ్యులు (ఎమ్మెల్యేలు), ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

## డీఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

సమాచారంతో రెడ్కో డివిజనల్ ఇంజినీర్ (డీఈ) ముత్యం వెంకటరమణకు చెందిన నివాసాలు, కార్యాలయాలపై అధికారులు సంచలన దాడులు నిర్వహించారు. ఏకకాలంలో రాజధాని నగరం హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో 15 చోట్ల సోదాలు జరుపుతున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటికే భారీగా నగదును, ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (రెడ్కో)లో డీఈగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ముత్యం వెంకటరమణ అక్రమాస్తుల వ్యవహారంలో ఏసీబీ ఉచ్చు బిగించింది. ఆయన తన అధికారిక పరిధిని ఉపయోగించుకుని తన రాబడికి మించి భారీగా ఆస్తులు ఆర్జించారనే తీవ్రమైన ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. హైదరాబాద్‌లోని ప్రముఖ ఐటీ కారిడార్ ప్రాంతమైన మాదాపూర్‌లో ఉన్న డీఈ ప్రధాన నివాసంతో పాటు ఆయనకు సంబంధమున్న మరో 15 వేర్వేరు ప్రాంతాల్లో అధికారులు ఒకేసారి సోదాలు ప్రారంభించారు.

**8 బృందాలుగా విడిపోయి క్షుణ్ణంగా తనిఖీలు..**

ఏసీబీ డీఎస్పీ మాజిద్ ఖాన్ నేతృత్వంలో ఈ బృహత్తర సోదాల ప్రక్రియ సాగుతోంది. ఈ దాడుల కోసం ఏసీబీ అధికారులు మొత్తం 8 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి.. ముందస్తు ప్రణాళిక ప్రకారం ఆయా ప్రాంతాలపై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. వెంకట రమణకు ఉన్న స్థిరాస్తులు, చరాస్తులకు సంబంధించిన అనేక కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ఆయన ఇళ్లలో లభ్యమైన భారీ నగదును, బ్యాంక్ లాకర్లు, ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ తనిఖీలు పూర్తిగా పూర్తయిన తర్వాతే డీఈ ముత్యం వెంకట రమణకు సంబంధించి పట్టుబడిన మొత్తం ఆస్తుల విలువ, లభ్యమైన నగదు, స్వాధీనం చేసుకున్న కీలక పత్రాల వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని ఏసీబీ స్పష్టం చేసింది. ఈ సోదాల వార్త వెలువడటంతో రెడ్కో శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల్లోని అధికారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

## బైక్‌లు, పంచలోహ విగ్రహాల దొంగతనాలకు పాల్పడుతున్న షేక్ సద్దాం అరెస్ట్

జయభేరి, అంబర్పేట :

సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఒకవైపు ద్విచక్ర వాహనాలను, మరోవైపు దేవాలయాల్లోనీ పంచలోహ విగ్రహాలను దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అంబర్పేట్ పోలీసులు అరెస్ట్ చేశారు అంబర్ పేటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న షేక్ సద్దాం అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు పంచలోహ విగ్రహాలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపి జగన్ తెలిపారు. ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న బైక్‌లను దొంగిలించి బైక్‌లతో పరారయ్యేవాడు. కేవలం బైక్ దొంగతనాలతో ఆగకుండా, రాత్రి సమయాల్లో దేవాలయాలలో విగ్రహాలు దొంగిలించేవాడు నీ తెలిపారు. అంబర్పేట్ టీం అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా, అతడు చేసిన వరుస నేరాలను ఒప్పుకున్నాడు. కాలనీవాసులు, ఆలయ కమిటీలు కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని, తగిన భద్రతా చర్యలు తీసుకోవాలనీ తెలిపారు.

## రోడ్డుపై నాట్లు వేసి నిరసన

జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :

రోడ్డు మంజూరు చేసి రెండు సంవత్సరాలైన నిర్మాణం చెప్పటక పోవడంతో గాంధీనగర్ వాసులు వినూత్నంగా రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోరికొత్తపల్లి మండలం గాంధీనగర్ లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రెండు ఏండ్ల క్రితమే స్థానిక ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు రోడ్డు నిర్మాణం పనులను మరిచిపోయారు. పలుమార్లు రోడ్డు గురించి వారి దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో బుధవారం అదే రోడ్డుపై పేరుకుపోయిన బురదలో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అంబులెన్సు, స్కూల్ బస్సు కూడా రావడం లేదని, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

# స్వాతినక్షత్రం.. గిరిప్రదక్షిణం

- యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా శతఘటాభిషేకం

జయభేరి, యాదగిరిగుట్ట, జులై 22 :

యాదగిరిగుట్టలో గిరిప్రదక్షిణ సందర్భంగా శ్రీలక్ష్మీ నారసింహ నామస్మరణతో మారుమ్రోగింది. స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా బుధవారం యాదాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుకుంది. గిరి ప్రదక్షిణ ప్రారంభానికి ముందు శ్రీస్వామివారి పాదాల దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దంపతులు, ఆలయ ఈవో భవానీ శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి గిరిప్రదక్షిణను నిర్వహించారు. అనంతరం మెట్ల మార్గంలో కొండపైకి వెళ్లి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, గోవింద నామస్మరణల మధ్య గిరిప్రదక్షిణ అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. గిరిప్రదక్షిణ తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో యాదాద్రి ఆలయం కిటకిటలాడింది. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయం ముఖ మండపంలో అష్టోత్తర శత ఘటాభిషేకాన్ని అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అర్చకులు గిరిప్రదక్షిణ,స్వాతి నక్షత్రం విశిష్టతను వివరించారు. గిరి ప్రదక్షిణ అనంతరం ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దంపతులు,ఏపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ దంపతులు శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామి వారి లడ్డు ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు.








## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే ఊరుకోం

- యూత్ కాంగ్రెస్ ఆలేరు నియోజకవర్గం అధ్యక్షుడు మంగ కిరణ్

జయభేరి, యాదగిరిగుట్ట, జులై 22 :

విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని, విద్యార్థుల జీవితాలను నాశనం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని యూత్ కాంగ్రెస్ ఆలేరు నియోజకవర్గ అధ్యక్షుడు మంగ కిరణ్ హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులకు మద్దతుగా ఢిల్లీలో ధర్నా చేపట్టిన రాహుల్ గాంధీని అరెస్ట్ చేసినందుకు నిరసనగా యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మంగ కిరణ్ మాట్లాడుతూ ఢిల్లీలో నిరసన తెలియజేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం అమానుషమని, తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలో పడేసేలా బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అండగా ఉంటామని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు మా పోరాటం ఆగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాత్విక్,నేతలు నిమ్మల శివ, కళ్లెం కరుణాకర్,సాయి కిరణ్, శివ కుమార్,శివ ప్రసాద్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



## దేవరకద్రలో ఆషాడ మాసం మెహిందీ వేడుకలు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో బుధవారం మెహేంది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా స్థానిక మంజుల రాణి ఇంట్లో ఈ కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈనెల 23 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. విశేష మాసాన్ని పురస్కరించుకొని ఈ నెల 24న స్థానిక మహిళా భక్తులు ఒడిబియ్యం నింపడానికి అలంపూర్ దేవాలయానికి వెళ్ళనున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక మహిళా ఆర్యవైశ్య భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పనులను వేగవంతం చేయాలి

జయభేరి, హైదరాబాద్ :



హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు కమిషనరేట్ల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో మున్సిపల్ పరిపాలనా శాఖ అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి పనుల కోసం అవసరమైన భూ సేకరణ జరపకుండా టెండర్లను పిలవొద్దని, భూ సేకరణ కోసం ప్రత్యేక అధికారిని నియమించామని తెలిపారు. మూడు కమిషనరేట్ల పరిధిలో పనుల అనుమతుల కోసం అన్ని శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమన్వయ సమావేశం నిర్వహించాలని చెప్పారు.
సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ విగ్రహం, జంక్షన్ పనులను వేగవంతం చేయాలని హెచ్ఎండీఏ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (NIUM) భవన నమూనా, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నమూనాను పరిశీలించి పలు సూచనలు చేశారు. మున్సిపల్ వ్యవహారాల శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, GHMC కమిషనర్ ఆర్వీ కర్ణన్, సైబరాబాద్ కమిషనర్ జి. సృజన, మల్కాజిగిరి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి, HYDRAA కమిషనర్ రంగనాథ్, MRDCL మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, MDH, MWSSB కె. అశోక్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్‌పైన అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

- యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణి-భరత్ గౌడ్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ యాదవ్



జయభేరి, యాదగిరిగుట్ట, జులై 22 :

గ్యాస్ సిలిండర్‌పైన నిర్ణయించిన ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీలక్ష్మి నరసింహ ఎంటర్ ప్రైజెస్ గ్యాస్ ఏజెన్సీని మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణిభరత్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్యాస్ స్టాక్, సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుండి ప్రతి సిలిండర్‌పై రూ.996.50 మాత్రమే తీసుకోవాలని, ఎక్కువగా తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్యాస్ ధరలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎక్కువ డబ్బులు అడిగితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## వర్షపు నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

జయభేరి, యాదగిరిగుట్ట :




వర్షపు నీటిని సంరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. బుధవారం యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో క్యాచ్ ద రెయిన్ సేవ్ ఎవరీ డ్రాప్ కార్యక్రమ బ్రోచర్‌ను బీర్ల అయిలయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీటిని ప్రతి ఒక్కరూ సేకరించి భవిష్యత్ తరాలకు అందించాలని, నీటి వనరులను సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో వర్షపు నీటి సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి ఇంట్లో,ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యా సంస్థల్లో,వ్యాపార సముదాయాల్లో తప్పనిసరిగా రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేస్తే భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్యను చాలా వరకు అధిగమించవచ్చని తెలిపారు. ప్రజల్లో నీటి సంరక్షణపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, ఈరోజు ప్రతి నీటి చుక్కను కాపాడితే రేపటి భవిష్యత్తు సురక్షితం అవుతుందనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీ భరత్ గౌడ్, వైస్ చైర్మన్ బరిగె రమ్యారాంచందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జిఎంఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత పోలీస్ ఉద్యోగాల శిక్షణ

- దేవరకద్ర యువతకు శుభవార్త




జయభేరి, దేవరకద్ర :

దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి చొరవతో జిఎంఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎస్సై, కానిస్టేబుల్, గ్రూప్ పరీక్షలకు పూర్తిగా ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు.దేవరకద్ర నియోజకవర్గ యువతకు పోలీస్ ఉద్యోగాల సాధన కోసం ఎస్సై, కానిస్టేబుల్ గ్రూప్ పరీక్షలకు ఈ సందర్భంగా ఉచితంగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. హైదరాబాద్, కర్నూల్, మహబూబ్‌నగర్‌లలో బోధించిన అనుభవజ్ఞులైన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వనున్నారు. ఫిజికల్, పరీక్షా ప్రణాళిక, మెటీరియల్‌తో కూడిన శిక్షణ ఇస్తారు. శిక్షణకు హాజరైన వారికి భోజనం, వసతి కల్పిస్తున్నారు. దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలోని ఈ ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు.

**అప్లికేషన్ తేదీలు..**

ఈనెల 23 నుండి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈనెల 30 వరకు ఈ దరఖాస్తులకు చివరి తేదీగా నిర్ణయించారు. ఇందుకు కావాల్సిన పూర్తి సమాచారం కావాలనుకునేవారు ఈ ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. కొత్తకోట: 9989948817, 9676890117, దేవరకద్ర: 9550924669, 9100189540 సంప్రదించాలన్నారు. ఉద్యోగ లక్ష్యంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విజయాన్ని సాధించాలని జిఎంఆర్ సేవా సమితి కోరింది.

## 24న చిన్న రాజమూర్ దేవస్థానం హుండీ లెక్కింపు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం మండలం పరిధిలోని దేవరకద్ర మండలం చిన్నరాజమూరు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 24న (శుక్రవారం) హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆరోజు ఉదయం 11 గంటలకు దేవాలయంలోని హుండీ లెక్కింపు కార్యక్రమానికి ప్రారంభించనున్నారు. కావున ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్, గ్రామ పెద్దలు పాల్గొనాలని దేవస్థానం నిర్వాహకులు కోరారు.

## రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం

- 2029లో బీజేపీని గద్దె దించడం ఖాయం
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

జయభేరి, యాదగిరిగుట్ట:



విద్యార్థులకు మద్దతుగా నిరసన తెలుపుతున్న రాహుల్‌గాంధీని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. భారత దేశాన్ని సర్వనాశనం చేసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు.
ప్రధాని మోదీ,ఆయన మంత్రులు దేశ సంపదను అమెజాన్,అదానీ,అంబానీకి దోచిపెడుతూ కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. సామాన్య ప్రజలు,రైతుల నడ్డి విరుస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారన్నారు. పేపర్ లీకేజీలతో విద్యార్థులు, యువత జీవితాలు నాశనమవుతున్నాయని, నీట్ పేపర్ లీకేజీలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఎందుకు పదవి నుంచి తొలగించడం లేదని ప్రశ్నించారు. అరెస్ట్‌లతో ఉద్యమాలను అడ్డుకోవాలని చూస్తున్నారని, ఇకపై భారత దేశంలో బీజేపీ ఆగడాలు సాగవని అన్నారు.
ధర్నాలు,నిరసనలు తెలిపితే అరెస్ట్‌లు చేయడం సరికాదని, ఇది ప్రజాస్వామ్యానికి విఘాతమని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలంతా గమనిస్తున్నారని, 2029సంవత్సరంలో బీజేపీని గద్దె దించడం ఖాయమన్నారు. విద్యార్థులు, యువతపై మోదీకి చిత్తశుద్ధి ఉంటే ధర్మేంద్ర ప్రసాద్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## ఓటరు పేరు లేకపోతే సంక్షేమ పథకాలు అందవు

జయభేరి, హైదరాబాద్ :

ఓటరు జాబితాలో పేరు లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కోల్పోయే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ వంటి పథకాల కోసం ఓటరు వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలి. ఓటరు జాబితాలో పేరు లేకపోతే, అధికారికంగా ఓటరుగా గుర్తింపు ఉండదు.

## మేడ్చల్ లో కాంగ్రెస్ పార్టీ నిరసన

జయభేరి, మేడ్చల్ :

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును ఖండిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు మేడ్చల్ పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.బీజేపీ డౌన్ డౌన్ అంటూ నినాదలు చేస్తూ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.



# సర్పంచులకు అండగా ప్రభుత్వం

- దమగ్నాపూర్ లో చిన్నచింతకుంట మండలం సర్పంచులతో ఎమ్మెల్యే ముఖాముఖి

**జయభేరి, దేవరకద్ర :**

అభివృద్ధి విషయంలో సర్పంచులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సర్పంచులకు సూచించారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ లో బుధవారం చిన్నచింతకుంట మండల సర్పంచులతో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గ్రామాలలో అన్ని సౌకర్యాలు కల్పించడానికి ఆయా గ్రామాల సర్పంచ్ లు కృషి చేయాలన్నారు. దీనికిగాను సర్పంచ్ లకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా సర్పంచుల సమస్యలను ఎమ్మెల్యే జిఎంఆర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామానికి నూతనంగా పనులను మంజూరు చేసి వారికి ప్రొసీడింగ్లను ఆయా గ్రామాల సర్పంచ్ లకు ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. అలాగే చిన్నచింతకుంట మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మద్దూరు గ్రామ సర్పంచ్ దామోదర్ యాదవ్ ను సన్మానించి ఎమ్మెల్యే జీఎంఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- విద్యార్థులకు సైకిళ్ళు, టై, బెల్ట్, షూస్ ల పంపిణీ



**జయభేరి, దేవరకద్ర :**

విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం వడ్డేమాన్ ప్రభుత్వ పాఠశాలకు నెల్లికొండి నుండి కాలినడకన వచ్చే విద్యార్థిని, విద్యార్థులకు బుధవారం ఎమ్మెల్యే జీఎంఆర్ సైకిళ్ళను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. వివిధ గ్రామాల నుండి పాఠశాలకు వచ్చే విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు ఈ సైకిళ్ళను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని తమ తల్లిదండ్రులతో పాటు తమ గ్రామానికి, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఎమ్మెల్యే జిఎంఆర్ ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా వడ్డేమాన్, దమగ్నాపూర్ గ్రామాలకు చెందిన విద్యార్థులకు టై, బెల్టు, షూస్ లను ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారంలు నిర్ణీత సమయంలో అందజేయండి

- ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సర్ సహాయక కేంద్రాలు సమర్థంగా పనిచేయాలి
- మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్



**జయభేరి, ఉప్పల్ :**

చిల్కానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ఈరోజు తమ ఎన్యూమరేషన్ ఫారంని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా (ఐఏఎస్)కి వారి కార్యాలయంలో అందజేశారు. అనంతరం కార్పొరేటర్ గీత ప్రవీణ్ మాట్లాడుతూ ... ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ సాఫీగా జరిగేలా బీరప్ప గడ్డ మరియు చిల్కానగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు, అదే విధంగా నిజమైన ఓటర్ల కి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బిఎల్వోల తో సమన్వయం చేసుకుంటూ వారికి సహకరించాలని సూచించారు, అదేవిధంగా ప్రజలకు కూడా వారికి అందిన ఎన్యూమరేషన్ ఫారంలు నిర్ణీత సమయంలో పూర్తి చేసి బిఎల్ఓ లకు లేదా బిఎల్ఏ లకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

# భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే


**జయభేరి, తుర్కపల్లి, జూలై 22 :**

గ్రామంలో భూముల రీ సర్వేను నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ రవికుమార్ తెలిపారు. బుధవారం తుర్కపల్లి మండలం ధర్మారం గ్రామంలో భూభారతి భూ సర్వే, రీ సర్వే పై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి మండలంలో నాలుగు గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా తుర్కపల్లి మండలంలో ధర్మారం, కోమటికుంట, నాగాయపల్లి, శ్రీనివాసపురం గ్రామాల్లో చెరువులు, రోడ్లు, వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములు, కొండలు, ప్రభుత్వ భూములు, గుట్టలు, గ్రామంలోని మొత్తం భూములను రీ సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధనావత్ రజనీ పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్

**జయభేరి, మేడ్చల్, జూలై 22:**



కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును ఖండిస్తూ మేడ్చల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. అలాగే నీట్ (NEET) పరీక్ష పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు తోటకూర వజ్రెష్‌యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఈ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ ఘటనతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. దీనికి పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఇటువంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మైపాల్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు మహేష్ గౌడ్, బాలు రెడ్డి, అధికార ప్రతినిధి సత్య నారాయణ, జనరల్ సెక్రటరీ బీపీటీ రాజు, డివిజన్ అధ్యక్షులు చాప రాజు, మల్లేష్ గౌడ్, సురేందర్ ముందిరాజ్, డబుల్‌పూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు విఘ్నేశ్వర్ రెడ్డి, మాజీ మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సాయిపేట శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రమేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడానికి నిరసిస్తూ కాంగ్రెస్ ఆందోళన

- ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ధర్నా

**జయభేరి, దేవరకద్ర :**



కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. నీట్ పేపర్ లీకేజి కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఈ సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) డిమాండ్ చేశారు. మహబూబ్ నగర్ చిన్న చింతకుంట మండలం లాల్ కోట ఎక్స్ రోడ్ వద్దనున్న రాయచూర్ ప్రధాన రహదారిపై బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి వ్యతిరేకంగా, ఢిల్లీలో విద్యార్థులకు మద్దతుగా ఆందోళన చేపట్టిన లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని మరియు విచక్షణ రహితంగా విద్యార్థులపై లాటి చార్జి చేయడానికి, టియర్ గ్యాస్ ప్రయోగించడానికి నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా, మోడీకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. విద్యార్థులపై లాఠీ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం అమానుషమని దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, ప్రధాన మోడీ రాజీనామా చేయాలని ఎమ్మెల్యే జిఎంఆర్ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఎమ్మెల్యే విమర్శించారు. యువతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన అన్నారు. అరెస్టులతో విద్యార్థులను, రాహుల్ గాంధీని అడ్డుకోలేరని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆరుతడి వైపు అన్నదాత..!

- ఎల్నినో ఎఫెక్ట్ ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు
- జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ జానయ్య

**జయభేరి, తుర్కపల్లి, జూలై 22 :**



ఆరుతడి వైపు అన్నదాత! ఎల్నినో ఎఫెక్ట్ ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ జానయ్య అన్నారు బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ప్రస్తుత ఎల్ నినో ప్రభావం గురించి వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం మండలంలో అధికంగా ఉన్నందున దానిని ఎదుర్కొనే చర్యల గురించి వివరించారు. ఎల్ నినో ప్రభావం మండలంలో అధికంగా కనిపిస్తుంది కావున ఈ వాతావరణం వలన మనకు వర్షాలు పడకపోవడం ద్వారా గరిష్టంగా నీటి కొరత ఏర్పడడం జరుగుతుందని అన్నారు. దీని కారణంగా రాష్ట్ర ప్రభుత్వం వరి పంట సాగును తగ్గించి తక్కువ నీటి అవసరం ఉన్న పప్పు జాతికి చెందిన పంటలు కందులు, మినుములు, బొబ్బర్లు, నూనె గింజ, పొద్దు తిరుగుడు, కుసుమలు, చిరుధాన్యాల పంటలు, కూరగాయలు పెట్టుకోవాలని తెలియజేశారు. ఈ ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా అధిక దిగుబడులు కూడా సాధించవచ్చు అని అన్నారు. ఇట్టి విషయాన్ని రైతులు గమనించి సాగు పద్ధతులను మార్చి అధిక ఆదాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని శ్రీ ఉమా, ఉద్యానవన శాఖ అధికారి స్నేహిత, పశుసంవర్ధక శాఖ మండల అధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి, నీటిపారుదల శాఖ అధికారి అనంతరెడ్డి, మండల ఏఈవోలు, హెచ్ ఈ ఓ లు, పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియ సాఫీగా సాగేలా సహాయ కేంద్రాలు సమర్థంగా పని చేయాలి

- రామన్నగారి రాఘవేందర్ గౌడ్

**జయభేరి, మేడ్చల్, జూలై 22:**




సర్ (SIR) ప్రక్రియ సాఫీగా, వేగవంతంగా జరిగేలా ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేసి ప్రతి అర్హులైన ఓటర్లకు అవసరమైన సేవలు అందించాలని కాంగ్రెస్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ సూచించారు. సర్ ప్రక్రియలో నిజమైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేదా నష్టం కలగకుండా అధికారులు, బీఎల్ఓలు, పార్టీ కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియలో భాగంగా మేడ్చల్ డివిజన్ సర్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ కలిసి మేడ్చల్ డివిజన్ పరిధిలో ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సర్ హెల్ప్ డెస్క్‌లను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ ప్రక్రియ ద్వారా ఓటర్ల వివరాల పరిశీలన పారదర్శకంగా జరగాలని, అర్హులైన ప్రతి ఓటరికి అవసరమైన సహాయం అందేలా హెల్ప్ డెస్క్‌లు నిరంతరం అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ దరఖాస్తుల స్వీకరణ, అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడం, సందేహాలకు సమాధానాలు ఇవ్వడం వంటి సేవలను మరింత సమర్థంగా అందించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంలో కాంగ్రెస్ శ్రేణులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నాయకులు కోరారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించేలా సహాయ కేంద్రాలు పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ, చిల్ల వెంకటేష్ ముదిరాజ్, కటిక వినయ్, ఇనాయత్ అలీ, సర్ ఇన్‌చార్జిలు చంద్రకాంత్, లింగం, బీఎల్ఏలు, బీఎల్ఓలు, కాంగ్రెస్ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# అర్ధరాత్రి వేళల్లో ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించిన ఇద్దరికి జైలు శిక్ష

**జయభేరి, హయత్‌నగర్, జూలై 22:**

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి వేళల్లో పాన్ షాపులను నిబంధనలకు విరుద్ధంగా తెరిచి ఉంచడం, నేరస్థులు మరియు అనుమానాస్పద వ్యక్తులు రోడ్లపై సంచరించే పరిస్థితులు కల్పించడం ద్వారా ప్రజా శాంతి, భద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన ఇద్దరు వ్యక్తులపై హయత్‌నగర్ పోలీసులు చట్టపరమైన చర్యలు చేపట్టారు. నిందితులు 1. గుడెల్లి యాకయ్య(40), తండ్రి గోపిచ్, వృత్తి: కూలీ, రోడ్డు నెం.2, వినాయక నగర్, హయత్‌నగర్. 2. సయ్యద్ ఇర్ఫాన్ (41), తండ్రి సయ్యద్ అలీ మునావర్, వృత్తి: వ్యాపారం, హెచ్.నెం.4124, హయత్‌నగర్, అమంగల్, రంగారెడ్డి జిల్లా. వీరిని హయత్‌నగర్ పోలీసులు న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కేసు విచారించిన న్యాయస్థానం ఇద్దరికీ రెండు (02) రోజుల సాధారణ కారాగార శిక్ష విధించింది. అనంతరం న్యాయస్థానం ఉత్తర్వుల మేరకనిందితులను చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించి జైలులో ప్రవేశపెట్టడం జరిగింది.

**హయత్‌నగర్ పోలీసుల హెచ్చరిక:**

అర్ధరాత్రి వేళల్లో పాన్ షాపులు, టీ దుకాణాలు లేదా ఇతర వ్యాపార సంస్థలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించడం, నేరస్థులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులు గుమిగూడేందుకు అవకాశం కల్పించడం, ప్రజా శాంతి, భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడడం వంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హయత్‌నగర్ పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం కొనసాగుతుందని తెలిపారు.

**ప్రజలకు విజ్ఞప్తి:**

వ్యాపారులు ప్రభుత్వం, పోలీసు శాఖ జారీ చేసిన నిబంధనలు, సమయ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని, ప్రజా శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు ఎటువంటి అవకాశం కల్పించరాదని హయత్‌నగర్ పోలీసులు కోరుతున్నారు.

# రోడ్లు, డ్రైనేజీ మరమ్మతులకు శ్రీకారం

- జీహెచ్ఎంసీ అధికారుల స్పందనపై భాస్కర్ యాదవ్ హర్షం



**జయభేరి, మేడ్చల్, జూలై 22:**

మేడ్చల్ సర్కిల్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి మరమ్మతు పనులు ప్రారంభించడం హర్షణీయమని మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లు, మూసుకుపోయిన డ్రైనేజీల కారణంగా ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాటం నిర్వహించిందని తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి వెంటనే స్పందించిన జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజల భద్రత, సౌకర్యాల దృష్ట్యా రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని ఆయన కోరారు. వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్న డిప్యూటీ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులకు భాస్కర్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఇదే విధమైన చొరవ కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

# ఎస్.ఐ.ఆర్‌పై కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు అవగాహన లోపంతో చేసినవే..

- పట్లోళ్ల విక్రమ్ రెడ్డి

జయభేరి, మేడ్చల్, జూలై 22:



దేశంలో సంస్కరణలు అమలు చేసే ప్రతి సందర్భంలో కాంగ్రెస్ పార్టీ అడ్డుపడుతూనే ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి విమర్శించారు. ఎస్.ఐ.ఆర్ (SIR) ప్రక్రియపై కొందరు కాంగ్రెస్ నేతలు అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఓట్లను లక్ష్యంగా చేసుకుని బీజేపీ ఈ ప్రక్రియ చేపడుతోందని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. దేశంలో ప్రతి పౌరుడికి ఒక్కరికి ఒకే ఓటు ఉండాలనే లక్ష్యంతో అధికారులు చిత్తశుద్ధితో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా ఎవరి ఓటు హక్కు కోల్పోకుండా చూడడమే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇది కొత్తగా చేపట్టిన కార్యక్రమం కాదని, గతంలోనూ దేశవ్యాప్తంగా అనేకసార్లు నిర్వహించారని స్పష్టం చేశారు. భారతదేశాన్ని కులాలు, మతాల పేరుతో విభజించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని విక్రమ్ రెడ్డి ఆరోపించారు. ఎస్.ఐ.ఆర్ వల్ల మైనార్టీలు, ఎస్సీలు, ఎస్టీలకు ఏ విధంగా అన్యాయం జరుగుతుందో కాంగ్రెస్ నాయకులు ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. దశాబ్దాలుగా ఆయా వర్గాల జీవన పరిస్థితుల్లో మార్పు తీసుకురాకుండా వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నారని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. తెలంగాణలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ అమలు చేయలేని అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిలో ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి కాంగ్రెస్ అంతర్గత వర్గపోరాటాలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీజేపీ రోజురోజుకూ బలపడుతుండటంతో కాంగ్రెస్ భయాందోళనకు గురైందని, అందుకే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలను మానుకోవాలని హెచ్చరించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పట్లోళ్ల విక్రమ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, మాజీ ఎంపిటిసి ఉషిగారి శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ పిఏసీఎస్ వైస్ చైర్మన్ కిషన్, డివిజన్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్, నాయకులు సురేష్, కృష్ణా, నవాణిత, రామారావు, ముక్కిడిగాళ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## నీట్ పేపర్ లీక్ అక్రమార్కుడు ధర్మేంద్ర ప్రధాన్... రాజీనామా చెయ్యాలి

- విద్యార్థులపై లాఠీచార్జి అమానుష్యం
- తెలంగాణ ఎస్సి జన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయెందర్,
- వెలిశాల శ్యామ్ మహర్,

జయభేరి, దంతాలపల్లి, జూలై 22 :

నీట్ పేపర్ లీక్ విషయంలో అక్రమార్కుడిగా ఆరోపణలు ఎదుర్కుంటున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలని తెలంగాణ ఎస్సి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయెందర్, రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిన్నటి కాక్రోచ్ ఆందోళన నేటి రైతుల ఆందోళనను ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశంలో రోజు రోజుకు బిజెపి ప్రభుత్వం విద్యార్థులను, రైతులను ఇబ్బందులకు గురించేస్తుందని అన్నారు. భారత విద్యార్థుల హక్కుల కోసం శాంతియుతంగా నిరసనపై దాడి ప్రజాస్వామ్య స్ఫూర్తిపై జరిగిన తీవ్ర దాడిగా పేర్కొన్నారు ఇది దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిస్థితిపై అనేక ప్రశ్నలను వున్నాయి అన్నారు. నీట్ పరీక్షల వ్యవహారంలో న్యాయం కోరుతూ, కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సింది పోయి ప్రభుత్వం పోలీసుల ద్వారా అణచివేత మార్గాన్ని ఎంచుకుంది. ప్రజాస్వామ్యానికి ఏమాత్రం శోభనీయమైనది కాదు ఈ దేశ ప్రజలకు సమాధానాలు కావాలి. నీట్ పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. దేశ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన ఈ సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వీడి విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనలకు సమాధానం చెప్పాలి. అత్యంత ముఖ్యంగా, నీట్ పరీక్షల సంక్షోభంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరగాలి. కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశాన్ని విస్మరించే హక్కు ఎవరికీ లేదు. ప్రజల సమస్యలపై చర్చించడానికే పార్లమెంట్ ఉంది. దేశ యువత భవిష్యత్తుకంటే ముఖ్యమైన అంశం మరొకటి లేదు. తెలంగాణ విద్యరుల పక్షాన పూర్తి మద్దతు కాక్రోచ్ జనతా పార్టీకి ఉంటుందని తెలిపారు.



## పార్టీ వెన్నుపోటు దారులను శిక్షించాలి

- లక్కం శంకర్, మాజీ ఏజిపి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు
- కాంగ్రెస్‌లో కోవర్టు రాజకీయాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఏజిపి
- పార్టీకి వెన్నుపోటు పొడిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

జయభేరి, పరకాల, జులై 22 :

కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తల కష్టాన్ని కొందరు కోవర్టు రాజకీయాలు చేసే వ్యక్తులు దెబ్బతీస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఏజీపీ (న్యాయవాది) లక్కం శంకర్ ఆరోపించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా శ్రమిస్తున్న కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసే విధంగా కొందరు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ వ్యవహారమే

**స్థానిక ఎన్నికల్లో పార్టీకి నష్టం..**

జరిగిందని, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి అనుకూలంగా పనిచేయాల్సిన కొందరు నాయకులు ఇతర పార్టీల అభ్యర్థులకు మద్దతుగా వ్యవహరించారని ఆరోపించారు. ఇటువంటి చర్యలు పార్టీని బలహీనపరిచేలా ఉన్నాయని పేర్కొన్నారు.

**ఆధారాలు బయట పెడతా..**

పార్టీలో ఉంటూనే పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారికి సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, వాటిని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**కార్యకర్తల త్యాగాలను కాపాడాలి..**

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు చేసిన త్యాగాలను గౌరవించాల్సిన అవసరం ఉందని లక్కం శంకర్ అన్నారు. పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేసే వారు తమ వైఖరిని మార్చుకోవాలని, లేకపోతే రాజకీయంగా ప్రజల ముందు నిలదీయబడతారని హెచ్చరించారు.

## పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా తపాలా అధికారి జి.సంపత్ రెడ్డి

జయభేరి, మేడ్చల్, జూలై 22:




కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పోస్టల్ పొదుపు, బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక భద్రతను పెంపొందించుకోవాలని జిల్లా తపాలా అధికారి జి. సంపత్ రెడ్డి అన్నారు. బుధవారం పూడూరు-కిష్టాపూర్ డివిజన్ పరిధిలోని పూడూరు వార్డు కార్యాలయంలో పూడూరు పోస్ట్ ఆఫీస్ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జి.సంపత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు పోస్టాఫీస్ ద్వారా అందుబాటులో ఉన్న సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్, తపాలా జీవిత బీమా, టైమ్ డిపాజిట్స్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సేవలు, బీమా పథకాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. పోస్టాఫీస్ పథకాల ద్వారా సురక్షితమైన పొదుపుతో పాటు మంచి వడ్డీ, బీమా రక్షణ, పెన్షన్ వంటి అనేక ప్రయోజనాలు పొందవచ్చని ఆయన తెలిపారు. ప్రతి కుటుంబం తమ అవసరాలకు అనుగుణంగా పోస్టల్ పథకాలను ఎంపిక చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ సబ్ పోస్ట్ మాస్టర్ డి.సౌజన్య, పూడూరు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ వై.దిలీప్, వార్డు ఆఫీసర్ రాజబాబు, మాజీ సర్పంచ్ బాబు యాదవ్, మాజీ వార్డు సభ్యులు శేఖర్ రెడ్డి, కోలా వెంకటేష్, యాటవెల్లి హన్మంత్ రెడ్డి, శేషికుమార్, గ్రామస్తులు శంకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

- కాంగ్రెస్ తీరును ఖండించిన బీజేపీ నాయకులు



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ భారతీయ జనతా పార్టీ దేవరకొండ పట్టణ శాఖ అధ్యక్షులు వస్కుల సుధాకర్ ఆధ్వర్యంలో నిన్న దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ నాయకులు చేసిన ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఈరోజు దేవరకొండ పట్టణంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకూరి నరసింహ మాజీ పార్లమెంట్ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ విభేదాలు సహజమైనవేనని, అయితే దేశ ప్రధానమంత్రి నివాసాన్ని ముట్టడించే ప్రయత్నం చేయడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, దేశ ప్రజలు ఇలాంటి రాజకీయాలను ఎప్పటికీ సమర్థించరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రయోజనాల కంటే రాజకీయ స్వార్థానికే ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. దేశ ప్రజలు కాంగ్రెస్ వైఖరిని గమనిస్తున్నారని, ప్రజల మద్దతుతో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నల్లగొండ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ జల్దా భాస్కర్, వనం జగదీశ్వర్ , నేతల వెంకటేష్ యాదవ్ , గంజి హరి చండీశ్వర్, రెడ్డి శంకర్, వజ్ర కుమార్, కాసుల శంకరయ్య, నీలసుమన్, నేరేడు గోమ్ము మండల అధ్యక్షులు నాగిళ్ల ఆంజనేయులు అప్పం అజయ్, పొలగోని గణేష్, ఎర్ర బిక్షపతి, కుంబం తిరుపతి గౌడ్ నాగరాజు, వివిధ మోర్చాల బాధ్యులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దశలవారీగా మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తాం

- చైర్ పర్సన్ శ్రీదేవి
- 24వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం
- మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు

జయభేరి, మేడ్చల్, జూలై 22:



దశలవారీగా మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామని ఎల్లంపేట్ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి రమేష్ తెలిపారు. బుధవారం ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి పనులను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం చైర్‌పర్సన్ శ్రీదేవి రమేష్ మాట్లాడుతూ వార్డులో చాలా కాలంగా స్థానికులు ఎదుర్కొంటున్న మురుగు నీటి సమస్యకు ఈ డ్రైనేజీ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్తయిన తర్వాత వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే పరిస్థితులు తగ్గడంతో పాటు పారిశుద్ధ్యం మెరుగుపడి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధికి మున్సిపాలిటీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలను దశలవారీగా కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. స్థానిక ప్రజలు కూడా డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రజిత దేవేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కృష్ణా రెడ్డి, కౌన్సిలర్లు అర్చనా శ్రీనివాస్, శ్రీలత రమేష్, మలోత్ రజిత రాజేందర్ నాయక్, వరలక్ష్మి సురేందర్, వార్డు ఆఫీసర్ రవీందర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పశుగ్రాస విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జయభేరి, తుర్కపల్లి, జూలై 22 :

పశుగ్రాస విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జానయ్య అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలంలో పశుగ్రాస క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులందరూ పశుగ్రాసాలను పెంచుకొని పశు సంపదను కాపాడుకోవాలని అన్నారు. పశు వైద్యశాలలో 75% సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి, బైఫ్ సిబ్బంది పెండెం ప్రవీణ్ పాల్గొన్నారు.

## తానాం జెడ్పీ హైస్కూల్లో అభయ పై అవగాహన కార్యక్రమం



జయభేరి, పరవాడ:

పరవాడ మండలం తానం గ్రామంలో తానాం జెడ్పీ హైస్కూల్లో అభయ అవగాహన కార్యక్రమం పరవాడ పోలీస్ శాఖ నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు మహిళల భద్రత బాలల హక్కులు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, సైబర్ నేరాల నివారణ సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అత్యవసర పరిస్థితుల్లో 112, 1930 హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగం, అలాగే శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఏవైనా వేధింపులు సైబర్ మోసాలు లేదా అనుమానాస్పద సంఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పోలీసు సిబ్బంది మరియు సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సీచ్ భీమరాజు మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఏ సమస్య ఎదురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

## మాజీ సీఎంని మర్యాదపూర్వకంగా కలిసిన పెందుర్తి మాజీ ఎమ్మెల్యే



జయభేరి, పరవాడ:

విజయవాడలో తాడేపల్లి వైస్సార్సీపీ క్యాంప్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని పెందుర్తి మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, పెందుర్తి నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన పార్టీ కార్యక్రమాలు, కూటమి నాయుకుల ద్వార్జన్యం గురుంచి వివరించారు. వారితో పాటు ఇటీవల వైస్సార్సీపీలో నూతనంగా నియమితులైన రాష్ట్ర ఎస్ఈసి సభ్యులు కోడిగుడ్ల దేవి సాంబ తదితరులు ఉన్నారు.

